# గుడిసె - దీర్ఘరోగి

ఎన్ని సార్లు వేసినా సంతృప్తి పరచడం లేదు.

అనుకొన్న "ఫీలింగు" రాలేదు. చిత్రాన్ని చూస్తున్న మిత్రులంతా అద్భుతంగా ఉందనే అంటున్నారు.

ముప్పై విధాల మార్చి చూశాను. "ఫీలింగు" రాలేదు!

చిత్రం అద్భుతంగానే ఉంది. తైల వర్ణాలతో వేసిన "దీర్ఘరోగి" చిత్రం!

గుడిసె, దాని ముందు నులక మంచం మీద కూర్చుని దీర్ఘరోగి. గుడిసె వెనక్కి రెండు యీత చెట్లు. వాటి మానులు ఏటేటా ఒక్క ఏడూ వొదలకుండా కల్లుకి నరికిన నరుకులు మెట్లుకట్టి ఉన్నాయి. వాటి తలల కింద తెగకోసిన పీకలికి కల్లుకుండలున్నాయి. ఓమూల చిత్రానికి తూకం సరిపెడుతూ నాలుగు కాళ్ళూ జాపి పంది పడుకుని ఉంది. బాగా వెనక ఆకాశం చివరిదాకా ప్రదేశ వైశాల్యం కనబడుతుంది. అదీ నే వేసిన చిత్రం.

రంగుల కలయిక, పరస్పరం ఖండించుకుంటూ అడ్డదిడ్డంగా వేసిన రేఖల పొందిక బహుమంచి చిత్రాన్ని శాస్త్రరీత్యా రూపొందించాయి. రంగులూ రేఖలు సరిపోతే ఏమి రాసినా చిత్రమే. రోగి మొహంలో "ఫీలింగు" నేను కోరుకున్నట్టు రాలేదు. దీర్ఘరోగి అని తెలుస్తున్నాది. రోగపు తీవ్రత అనుకున్నంత ఆదర్శప్రాయంగా బహిర్గతం కాలేదు. గుడిసె అద్భుతంగా సెట్టయి అమిరింది. రోగి మొహం, చూపు నన్ను సంతృప్తి పరచడం లేదు.

నా చిత్రాలలో ఆది నుంచి గుడిసెకి ప్రాధాన్యత అధికం. దృశ్యచిత్రం నేనేది వేసినా అందులో ఎక్కడో ఒక చోట గుడిసె చోటు చేసుకుంటుంది. గుడిసె అందం నన్నెప్పుడూ ఆకర్షిస్తుంది. ఏళ్ల తరబడి శిల్పులంతా చేరి కట్టిన తాజ్‌మహల్ గోరీకన్నా పాడేరు కొండచరియల్లో నవర వాడి గుడిసె నన్నాహ్లాద పరుస్తుంది.

కోకిల మీద పద్యం రాయని కవి కిశోరాలూ, గుడిసె చిత్రం వెయ్యని ప్రారంభ చిత్రకారులూ ఉండని మాట వాస్తవమే కాని నా తొలి బహుమతి చిత్రం గుడిసె. అన్ని దేశాల చిత్రకారుల చిత్రాల్లో గుడిసె కనబడుతూ ఉంటుంది. చిన్నప్పుడు దాని అందం ఒక్కటే నన్ను ఆకర్షిస్తూ ఉండేది. ఇప్పుడూ దానందం ఆకర్షిస్తుంది. ఐతే విషాదం కలుస్తుంది. పెద్దపులి సౌందర్యంలో క్రౌర్యంలాగ!

చిన్నప్పుడు నా అభిమాన కవి "వర్డ్స్‌వర్త్" కావ్యం ఎక్స్‌కర్షన్ (Excursion) చదువుతూ కొండొద్దున బండ మీద కూర్చుని ప్రకృతి సౌందర్యంలో లీనమైపోయే వాణ్ణి. చిత్రం వేసుకుంటూ రంగులో రంగులు కలుపుతూ కొత్త రంగుల వైచిత్రిలో కలిసిపోయేవాణ్ణి. తాదాత్మ్యం పొందేవాణ్ణి. భూమ్మీద మనిషై పుట్టినందుకు సౌందర్యానికి ముగ్ధుడనౌతూ ఆస్వాదిస్తూ జీవించడమే పరమావధిగా కనబడేది.

ఇదంతా ప్రారంభ యవ్వనంలో ప్రారంభ చిత్రకారుడిగా!

సరియైన జ్ఞానం కలిగిన తరవాత తెలిసింది. కోటానుకోట్ల ప్రజలు పెళ్లాం పిల్లలతో గుడిసెల్లోనే జీవిస్తున్నారనీ, కోటానుకోట్లు సగం తిని, అదీ లేక దరిద్ర జీవితం శ్రీరాములువారి కాలం నుంచీ, అశోకుల వారి కాలం నుంచీ నేటిదాకా జీవిస్తున్నారనీ మొగవాడు గోచీతో, ఆడది చింకికోక కుళ్లకంపుతో బతుకంతా బతుకుతూ మానం కాపాడుకొంటున్నారనీ కాస్త జ్ఞానం వచ్చాకే తెలిసింది. గుడిసె ఈ దేశస్థుడి నివాసం! ఈ జాతి ప్రతీక. గాంధీజీ ఎక్కడికి వెళ్లినా గుడిసె కట్టుకునేవాడు. గుడిసెల్లో దిగేవాడు. అంగవస్త్రం కట్టేవాడు. కోటానుకోట్ల మూగజీవుల ప్రతినిధి!

పైపైని చూస్తే గుడిసె కృష్ణశాస్త్రి గీతం! లోలోతుకి చూస్తే గుడిసె భయానకాల గూడు! గూడు మీద "తెల్లని మశూచి కుండలు గగనమ్మున చుక్కలు!"

అతి మనోజ్ఞమైన గుడిసె నా 'దీర్ఘరోగి" చిత్రంలో వేశాను. ఈ చిత్రం నారాయణబాబు "దేశమాత", శ్రీశ్రీ "భిక్షువర్షీయసి" గీతాలేతాలెత్తగా బైటకొచ్చింది.

ఈ చిత్రం నా ఊహల్లోకి రావడానికి యథార్థ సంఘటన ఒకటుంది. ఊరవతలికి షికారుపోతే మర్రిచెట్టు కింద పల్లెటూరివాళ్లు సేదతీరుతున్నారు. రోగగ్రస్తుణ్ణి నులకమంచం మీద వాళ్ల పల్లెనుంచి పదహారు మైళ్లు పట్నంలో పెద్దాసుపత్రికి మోసుకొచ్చారు. అక్కడ వైద్యం వల్ల ప్రయోజనం లేకపోగా తిరిగి వాళ్ల పల్లెకు పదహారు మైళ్లూ మోసుకుపోతూ ఉంటే పట్నం చివరికి రాకుండానే, ఆ నులక మంచం మీదే ఎక్కడో ప్రాణం గుటుక్కుమంది. నులక మంచంతో ఆ శవాన్ని కిందదించి మర్రికింద చతికిలపడ్డారు. పదహారు మైళ్లు మనిషిని మోసుకొచ్చారు. పదహారుమైళ్లు శవాన్ని మోసుకెళ్లాలి.

అది చూసి దీర్ఘరోగి చిత్రం కాన్వాసుకి ఎక్కించాను. పూర్తి చేశాను. ఏం లాభం? రోగి చచ్చిపోతాడేమో అన్నట్టు ఉండాలి. బాధ మొహం నిండా మూర్తీభవించాలి. ఎన్నెన్నో ప్రయత్నాలు చేశాను. ఆ మొహం కోసం! ఆస్పత్రుల ముందు నిలబడి ఎందరెందరో రోగుల్ని పరిశీలన చేశాను.

చిట్టచివరకు కృతకృత్యుణ్ణయ్యాను. వచ్చేసింది. నాక్కావలసిన "ఫీలింగు." మహాద్భుత మైన చిత్రం "బోద్లేరు" గీతాన్ని మించిపోయింది. విమర్శకులు ఆకాశానికి ఎత్తేశారు. ప్రదర్శనలలో బహుమతులందుకొంది. బొంబాయి కోటీశ్వరుడు కొనేశాడు. నా చెయ్యి దాటి వెళ్లిపోయింది. నాలుగు వేలు ఖరీదు పెడితే ఎవడూ కొనడనుకున్నాను. ఒకడు చిత్రకళా ప్రదర్శనంలో కొనేశాడు. నా చిత్రం ఇంక నాది కాదు!

ఆ చిత్రం బొంబాయి పట్టణంలో మలబారుగుట్టల దగ్గర కోటీశ్వరుడి మహాసౌధంలో ఉంది! ఆయన హాలు ఒక చిత్రకళా ప్రదర్శనశాల. చూడ్డానికి వెళ్ళండి. నేను వెళితే కౌగిలించుకున్నాడు. శాలువావేసి సత్కరించాడు. ఆయన మిత్రులందరికీ పరిచయం చేశాడు. ఎవరెళ్లినా ఓపికతో చిత్రాలన్నీ చూపిస్తాడు. టీ యిచ్చి పంపుతాడు.

నా చిత్రంలో ఉన్న "ఫీలింగు"కి ఆ మహానుభావుడు కొనలేదు! చిత్రంగా చిత్రానికి ఉన్న విలువనిబట్టి కొన్నాడు! ఆ చిత్రం ఎన్నిసార్లు చూసినా ఆ కోటీశ్వరుడిలో ఏ మార్పూ కలగదు. ఆ చిత్రంలో ప్రధానమైన రంగు ఏమిటో, మిగిలినరంగులన్నీ ఎలాగ్గా మిళితమై నాయో, చిత్రం ఏ విధంగా 'కంపోజు' అయిందో అలాంటివి ఆయన నేర్పుతో తెలివిగానే చెపుతారు.

ఒక్క సుగుణం అతనిలో ఉంది. చిత్రాలని అన్ని ముఖ్యమైన ప్రదర్శనలకి పంపుతాడు. నా "దీర్ఘరోగి" చిత్రం ఈ దేశానికి సందేశాన్ని ఇస్తూ ఎక్కడవున్నా దాని పని అది చేస్తూనే ఉంటుంది.

చిత్రాన్ని చూసీ చూడ్డంతో "దీర్ఘరోగి" మొహంలోకి దృష్టిని లాగేస్తుంది. రోగి చూపుతో చూసేవాడి చూపు కలుస్తుంది. గుండె గుభేలు మంటుంది. ఆ చూపు ఏదో అర్థిస్తూ ఉంటుంది. భరించశక్యంకాని బాధతో మరణ వేదనతో మనని ఏదో ప్రశ్నిస్తున్నట్టు కోరుతున్నట్టు కనబడుతుంది. సరియైన మందు వెయ్యమనా? గొంతుకలో కాస్త మంచి నీళ్ళు పొయ్యమనా? నేనిలాగా చావవలసిందేనా? చంపుతారా? ఎన్నాళ్లు చంపుతారు? అని వెయ్యి ప్రశ్నలు వేస్తున్నట్టు ఉంటుంది.

ఆ చూపులో ఆ మొహంలో అంత "ఫీలింగు" పట్టేసింది. ఆ "ఫీలింగు" ఎలాగ పట్టుకున్నాను? నా బుద్ధి కౌశలం మాత్రం కాదు. కాపీ కొట్టేశాను.

ఎక్కడ దొరికిందా మొహం? ఇంటికొచ్చిన ముష్టిదాని మొహం చూసి చూడ్డంతో "అమ్మయ్య" అనుకొన్నాను. నాకు కావలసిన మొహం ఆ ముసిలి ముష్టిదాని మొహం. దీర్ఘరోగంతో సమీపించిన చావు స్పష్టంగా కనబడుతూ, కర్రవూతతో నడవలేక నడుస్తూ, అరవలేక అరుస్తూ ముష్టెత్తుకు బతుకుతున్నాది. ఎందులోనోపడి ఎందుకీ బతుకని చావలేక బతుకుతున్నాది.

గుమ్మంలోకి వచ్చి ముష్టిది ముష్టి అరుపు అరిచింది.

"నీకు తిండి పెడతాను. పావుగంట నిలబడతావా?" అని అడిగాను.

"కడుపుకి ఎడితే బాబూ పావుగంటేటి? గంట నిలుసుంటాను" అంది.

"పావుగంట చాలు" అన్నాను.

"ఎందుకు బాబు?"

"నిన్ను చూస్తూ నీ బొమ్మ వేసుకుంటాను."

"ఎందుకు బాబు?"

"నాకెందుకో కావాలి"

"మనిషిని నూసి ఎయ్యగలరా?" తెలియని విషయం తెలుసుకోవాలనే అడిగింది.

"వేస్తాను. నువ్వుమాత్రం ఎండలో నిలబడాలి".

"ఎండకేటి బాబూ? బతుకంతా ఎండే! ఎండుతూనే బతికినాము. ఎండపడక కూడెక్కడ! ఎండే మా వెన్నెల" అన్నాది ముసిలి ముష్టిది.

నీడలు, ఎండ వెలుగులూ పడి దాని మొహంలో ఎనభై ఏళ్ళ జీవితపు బాధ, మరణ వేదన దేదీప్యమానంగా దివ్యజ్యోతులై వెలుగుతున్నాయి! దివ్యత్వం అన్నింటా ఉంది. వేదనలోనే చూశా!.

ముసిల్ది చేతులు మీదికెత్తి ఈగలు తోలుకొంది. జుత్తు ఎత్తిపట్టుకుంది.

"కదలక మొహం ఎత్తి నిలుచో" అన్నాను.

"ఊరు నిండా దిక్కుమాలిన ఈగలు! ఎక్కడికెళ్ళినా ఈగలే"! అంది. ఊరినిండా ఈగలులేవు. ముసలమ్మ మీద స్థిరపడి ముసలమ్మతో ఊరేగుతున్నాయి. కాళ్ల నుంచి నెత్తిదాకా పట్టేశాయి. వొంటినిండా జుమ్ము మంటున్నాయి. సరిగ్గా నా దీర్ఘరోగి!

ముసలమ్మ జుత్తు చీపురు దొంకలాగ తెల్లగా మీదికి లేచి ఉంది. దాన్నంతా కూడదీసి వెనక్కి ముచ్చటగా "ముచ్చటముడి" వేసుకుంది. నాకు కావలసినది దాని మొహమొక్కటే. అది జుత్తు సరిచేసి ముడివేసుకుంది. నా వొళ్లు జల్లుమంది.

నాలోనూ ఉంది సౌందర్య పిపాస. ముసిలి ముష్టిదానిలోనూ ఉంది. సౌందర్యం కోసం తపన! అందంకోసం అన్వేషిస్తున్నాను. చుట్టూ అందగించుకొంటున్నాను. అందం కోసం ఆరాటపడుతున్నాను. అందం కోసమే బతుకుతున్నాను. చచ్చే ముసిలి ముష్టిదానిలోనూ అందగించుకోవాలనే వాంఛ మిగిలి ఉంది. నే బొమ్మ వేస్తానంటే బైటకొచ్చింది.

"జుత్తెందుకు ముడివేశావు?" అడిగాను. అది ఎందుకు వేసుకుందో తెలుస్తూనే ఉంది.

"సింపిరిగా ఏటి బాగుంటాది?" అడిగింది! నేను గ్రహించినదీ ముసిల్ది చెప్పిందీ ఒక్కటే! చింపిరిగా జుత్తు బాగుండదు. సంస్కరించుకోవాలి. అందమైన బతుకే అందరికీ కావాలి!

ఆ ముసిల్దాని మొహం "ఫీలింగే" నా దీర్ఘరోగి "ఫీలింగు"! కాపీ కొట్టేశాను. దాని అధరోష్టం వాలిపోయి చొంగలు కారుతోంది. ఆ చొంగే ప్రబంధ కవుల అధరసుధ. దాని యౌవనంలో దాన్ని ప్రేమించినవాడు బతికి ఉంటే ఇప్పుడూ అదే!

"మనిషిని మనిషి ఏం చేస్తున్నాడో" దాని చూపు చెప్పేస్తున్నాది.

ఆ మొహాన్ని నా చిత్రంలోకి దిగుమతి చేసుకున్నాను. దాని "ముచ్చటముడి" వినియోగించుకోలేకపోయాను.

"ముచ్చటముడి" మనిషిలో అంతర్గతమై ఉన్న సౌందర్య పిపాస!

అదీ నా చిత్రం.

"గుడిసె – దీర్ఘరోగి."

❋

ఆంధ్రజ్యోతి వీక్లీ, దీపావళి సంచిక – 1975